క్లుప్తంగా

సీపీఎస్ విధానం రద్దుచేయాలి


మాట్లాడుతున్న శంకర్‌గౌడ్

సిరిసిల్లటౌన్: పాత పింఛన్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షన్‌పై పీఆర్సీని అమలు లేకపోవడంతో భవిష్యత్‌లో ఉద్యోగికి వచ్చే పింఛన్ పెరగదన్నారు. రాష్ట్రంలో సీపీఎస్ విధానం రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. నాయకులు గోల్కొండ శ్రీధర్, అంబటి రమేశ్, రవీందర్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి, రాచర్ల తిమ్మాపూర్ మాజీ సర్పంచులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ సర్పంచులు కొత్తపల్లి వాణి, తిమ్మాపూర్ పడిగెల రవి పార్టీలో చేరారు. మండలశాఖ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మాజీ ఎంపీటీసీ దేవయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, బుచ్చాగౌడ్, ఎల్లాగౌడ్, దేవేందర్, మల్లారెడ్డి, గంగయ్య, కిషన్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వీర్నపల్లి: ప్రభుత్వం కార్మికులు సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవుతుందని, కార్మికులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 27న ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీలతో చర్చలకు వ్యతిరేకంగా చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. సీఐటీయూ నాయకులు నరేందర్, నాయకులు దేవయ్య, బుస రాజాం,గంగిపల్లి అంజయ్య, రాజు, నర్సయ్య, శంకర్ చంద్రయ్య, రాజయ్య, చిన్న రాజాం పోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి

ఎల్లారెడ్డిపేట: ఇల్లంతకుంట మండలం కిష్టరావుపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను వేధింపులకు గురిచేసిన ఎంపీవో అబ్దుల్ వాహిద్పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ ఎస్సీ, ఎస్టీ కమిటీ మెంబర్ అజ్మీర తిరుపతినాయక్ కోరారు. మున్సిపల్ అకౌంటెంట్‌గా ఉద్యోగం వస్తే ఎన్వోసీ ఇవ్వకుండా తిప్పుకోవడంతోనే మానసిక వేదనకు గురై శనివారం గడ్డి మందు తాగాడన్నారు. ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌ను ఆదివారం పరామర్శించారు.

బాధ్యతలు స్వీకరణ

ముస్తాబాద్: మండల వ్యవసాయాధికారిగా సురేశ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ముస్తాబాద్ ఏవో వెంకటేశ్ కేశవపట్నం బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా సురేశ్‌రెడ్డి మండలకేంద్రానికి బదిలీ అయ్యారు.

అధ్యక్షుడిగా రాజేశం

ముస్తాబాద్: తెలంగాణ వీరభద్ర వీరముష్టి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ముస్తాబాద్‌కు చెందిన అగుల్ల రాజేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా గొల్లపల్లికి చెందిన బానాల గోపి, ప్రధాన కార్యదర్శిగా వేములవాడకు చెందిన మల్యాల తిరుపతి, కోశాధికారిగా కర్ని జంపయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మిట్టపల్లి శ్రీ కాంత్, సలహాదారులుగా భిక్షపతి ఎన్నికయ్యారు.

ఇసుక అక్రమ రవాణా

రుద్రంగి: సెలవురోజుల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఆదివారం మండలకేంద్రంలోని కొచ్చగుట్ట తండా ఆవరణలోని ఒర్రె నుంచి అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా తరలించారు. దీనిపై తహసీల్దార్ శ్రీలతను వివరణ కోరగా ఇసుక రవాణాకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

వేములవాడఅర్బన్: పట్టణంలోని రాజశ్రీ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న గుడిసె కృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు రూ.16,500 ఆర్థికసాయంగా అందజేశారు. ట్రస్ట్‌సభ్యులు తదితరులున్నారు.

నక్కవాగు దాటాలంటే నరకమే

- ఏడాదిగా సాగుతున్న బ్రిడ్జి నిర్మాణం
- అధికారులు ఆదేశాలు జారీచేసినా పనుల్లో జాప్యం
- ఇబ్బంది పడుతున్న పలు గ్రామాల ప్రజలు


హన్మాజిపేట శివారులోని నక్కవాగుపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన నిర్మాణం

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజిపేట గ్రామ శివారులో నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ.11.55కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఏడాదిగా నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో పలుగ్రామాల ప్రజలు వాగు దాటాలంటే నరకం చూడాల్సి వస్తోంది. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే ఈ ప్రాంతంలో పర్యటించి వర్షాకాలంలో ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు. కానీ ఎలాంటి రోడ్డుసౌకర్యం కల్పించకపోవడంతో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ వాగుపై వెళ్లేందుకు మార్గంలేక ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనెల 9న హన్మాజిపేట గ్రామానికి చెందిన ఐత లచ్చవ్వ (65) అనారోగ్యంతో బాధపడుతుండగా వృద్ధురాలి భర్త నారాయణ 108కి సమాచారం అందించారు. నక్కవాగు వద్ద రోడ్డు బాగా లేకపోవడంతో వాహనాన్ని అటువైపే నిలిపివేశారు. వృద్ధురాలిని రోడ్డువరకు గ్రామస్తులు, 108 సాయంతో ఇంటినుంచి వాగుమీదుగా దాదాపు 400 మీటర్ల దూరంవరకు స్ట్రెచ్చర్‌పై వాహనం వద్దకు తరలించారు. సకాలంలో ఆమెకు వైద్యం అందకపోవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ప్రతిరోజు ఈప్రాంత ప్రజలు ఇలా ఇబ్బందులు పడుతున్న సంఘటనలు కోకొల్లలు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వానాకాలం ముందే ఈ ప్రాంతాన్ని పరిశీలించి రోడ్డుసౌకర్యం కల్పించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. బ్రిడ్జి నిర్మాణం కాకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని పలుగ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.


వాగునుంచి వృద్ధురాలిని తరలిస్తున్న 108 సిబ్బంది (ఫైల్)

వాహనదారుల ఇబ్బంది

హన్మాజిపేటలోని నక్కవాగు పూర్తికాకపోవడంతో వేములవాడకు చేరుకోవాలంటే హన్మాజిపేట, మామిడిపల్లి, లింగంపల్లి గ్రామాల ప్రజలు మంగళపల్లి నుంచి సుద్దాల క్రాస్‌రోడ్డు మీదుగా వేములవాడకు చేరుకోవాలి. ఈ ప్రాంతంలో సైతం ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా మట్టి రోడ్డు బురద, గుంతలయమంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం మట్టిరోడ్డుకు మరమ్మతులు పనులు అయినా చేపట్టాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఏటా ఇక్కట్లు



బ్రిడ్జి పనులు ప్రారంభమైనప్పటికీ తిప్పలు తప్పడం లేదు. ఏటా వర్షాకాలంలో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం బ్రిడ్జి మంజూరు చేసింది. అయినా నిర్మాణం పూర్తికాకపోవడంతో ఈ ఏడాది కూడా ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం.

– పల్లికొండ నారాయణ, రైతు, హన్మాజిపేట

త్వరగా నిర్మించాలి



వంతెన పనులు జరుగుతున్న దృష్ట్యా తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ వర్షాలతో ఈ ప్రాంత ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. బ్రిడ్జి పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఆడెపు విజయ్‌కుమార్, హన్మాజిపేట

పనులు పూర్తయ్యేలా చర్యలు

బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ప్రజలు వెళ్లేందుకు తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశాం. ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. మళ్లీ తాత్కాలికంగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తాం. రూ.5కోట్లతో జరుగుతున్న ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపడతాం.

– శాంతయ్య, ఆర్అండ్‌బీ డీఈ, వేములవాడ

జర్నలిస్టులకు అండగా ఉంటాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: ప్రభుత్వపరంగా జర్నలిస్టులకు అండగా ఉంటామని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. జిల్లా టీయూడబ్ల్యూజే ఐజేయూ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండి ప్రతిక్షణం ప్రజల కోసం పనిచేస్తున్న జర్నలిస్టుల సేవలు మరవలేనివన్నారు. జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు లేనివారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు కృషిచేస్తానన్నారు. స్వయం ఉపాధిలో రాణించేందుకు అవసరమైన జర్నలిస్టు కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర జర్నలిస్ట్ సంఘం అధ్యక్షుడు విరహత్ అలీ మాట్లాడుతూ సంఘం బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. త్వరలోనే ప్రెస్ అకాడమీ ద్వారా శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్, జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి దేవేందర్, జిల్లా కార్యదర్శి ముత్యం, సీనియర్ జర్నలిస్టులు పూరెడి మల్లికార్జున్, టీవీ నారయణ, దేవేందర్, గడ్డం సత్యానారాయణరెడ్డి, హింగె శ్రీనివాస్, పుట్టపాక లక్ష్మణ్,, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర జర్నలిస్ట్ సంఘం అధ్యక్షుడిని సన్మానిస్తున్న జర్నలిస్టులు

ఎల్వోసీ అందజేత

వేములవాడ: పట్టణంలోని సాయినగర్‌కు చెందిన వంశీ కుమార్తె అన్విక‌కు పుట్టుకతోనే మూగ, చెవిటితనంతో బాధపడుతోంది. ఆపరేషన్ కోసం రూ.10 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు సూచించారు. నిరుపేద కుటుంబానికి చెందిన వంశీ అంత డబ్బు వైద్యంకోసం చెల్లించే స్థోమత లేకపోవడంతో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఒకే రోజులో రూ.5లక్షల ఎల్వోసీని ఇప్పించారు. ఆదివారం ఎల్వో సీ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.

విద్యాభివృద్ధికి సహకారం అందిస్తా

- ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి



ఎల్లారెడ్డిపేట: విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ప్రభుత్వ మాజీ సలహాదారు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి పేర్కొన్నారు. మండలంలోని నారాయణపూర్‌కు చెందిన సేవాసంస్థ సభ్యులు ఆదివారం హైదరాబాద్‌లో రమణాచారిని కలిశారు. సెప్టెంబర్ 20న గ్రామంలో గ్రంథాలయం ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ తన స్వగ్రామంలో సేవాసంస్థ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి సహాయ, సహకారాలైన అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కేంద్ర అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్, సేవా సమితి సభ్యులు పాత లింగన్న, మోతె దేవిరెడ్డి, లద్దునూరి తిరుపతి, నలిమెల సత్యనారాయణ, బొల్గం సుదర్శన్‌గౌడ్, టి.సుధాకర్‌రావు, నిమ్మ నారాయణరెడ్డి, వేల్పూరు రాజగోపాల్ తదితరులు ఉన్నారు.

ట్రా'ఫికర్'

- వేములవాడలో నిత్యం ట్రాఫిక్ జాం
- ఇరుకురోడ్లతో వాహనదారులు ఇబ్బంది
- పలుచోట్ల రోడ్ల విస్తరణ చేపట్టాలని డిమాండ్


తిప్పాపూర్ తెలంగాణ చౌక్‌లో వాహనాల రద్దీ

వేములవాడఅర్బన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయానికి నిత్యం భక్తులు వేలాది సంఖ్యలో తరలివస్తుంటారు. శ్రావణమాసం కావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తుంటారు. ఇతర ప్రాంతాలనుంచి వచ్చే భక్తులు వాహనాల మీద వస్తుండటంతో తిప్పాపూర్ తెలంగాణ చౌక్ వద్ద ట్రాఫిక్ జాం ఏర్పడుతుంతోంది. రోజురోజుకూయ వాహనాల సంఖ్య పెరుగుతున్నా పట్టణంలో రహదారులను మాత్రం విస్తరించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆది, సోమవారాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. పండుగ రోజుల్లోనూ ట్రాఫిక్ జాంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.


రాజన్న ఆలయానికి ఇదే రహదారి..

వేములవాడ పట్టణం, రాజన్న ఆలయం వరకు వాహనాలు వెళ్లాలంటే తిప్పాపూర్ నుంచి మాత్రమే వెళ్లాలి. కరీంనగర్, వరంగల్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, హైదరాబాద్ నుంచి వచ్చిన వాహనాలు ఒకే రహదారి గుండా వెళ్లాల్సి ఉంది. తిప్పాపూర్ తెలంగాణ చౌక్ వద్ద కరీంనగర్ – సిరిసిల్ల– వేములవాడ– వేములవాడ ఆర్టీసీ బస్టాండ్ ఇలా నాలుగు దారులు ఒకే చోట కలవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

ఇరుకు దారులతో ఇబ్బంది

వేములవాడ మూలవాగుపై రెండు బ్రిడ్జిల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఓ బ్రిడ్జి నిర్మాణం పూర్తికాగా వాహనల రాకపోకలు సాగుతున్నాయి. మరో బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచాయి. ఆ బ్రిడ్జి పనులు పూర్తయి, తెలంగాణ చౌక్ వద్ద చౌరస్తా వద్ద విస్తరణ పనులు చేపడితే ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉంటుంది. అధికారులు బ్రిడ్జి పనులు పూర్తిచేసి తిప్పాపూర్ వద్ద తెలంగాణ చౌక్ వద్ద రోడ్ల విస్తరణ చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.


నిత్యం ట్రాఫిక్



తిప్పాపూర్ తెలంగాణ చౌక్ వద్ద నిత్యం వాహనాల రద్దీతో ట్రాఫిక్ ఏర్పడుతోంది. అలాగే ఆది, సోమవారం, పండుగ రోజుల్లో వా హనాల రద్దీ అధికంగా ఉంటుంది. గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– ఎండీ అర్షద్, పండ్ల వ్యాపారి, తిప్పాపూర్


రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలి



తిప్పాపూర్ తెలంగాణ చౌక్ వద్ద రోడ్ల విస్తరణ చేపట్టి పెద్ద చౌరస్తా జంక్షన్ ఏర్పాటు చేయాలి. దీంతో ట్రాఫిక్ జాం లేకుండా వాహనదారులకు ఇబ్బందులు తొలగుతాయి. అధికారులు చొరవ తీసుకొని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

– పులి వెంకటేశ్, తిప్పాపూర్

ట్రాఫిక్ జాం లేకుండా చర్యలు



తిప్పాపూర్‌లో రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ కలుగుతోంది. తిప్పాపూర్ తెలంగాణ చౌక్ వద్ద ఇద్దరు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. భక్తులకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– సీఐ వీరప్రసాద్, వేములవాడ టౌన్



కోనరావుపేట: మండలంలోని కనగర్తి గ్రామం నుంచి సుద్దాలకు వెళ్లే దారి వంతెన వద్ద ప్రమాదకరంగా మారింది. వంతెనకు రెండు వైపులా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలి.

– బత్తుల రవి, కనగర్తి, కోనరావుపేట

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
అంజయ్య, పంచాయతీరాజ్ ఏఈ, సెల్ నెం. 9848518443

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346626

మోచి సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించుకోండి


మాట్లాడుతున్న ముత్యం

వేములవాడ: రాష్ట్ర మోచీ సంఘం ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించుకోవాలని రాష్ట్ర మోచి సంఘం నాయకులు సూచించారు. పట్టణంలోని ఎస్సారార్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రిటైర్డ్ జాయింట్ కలెక్టర్, రాష్ట్ర మోచి సంఘం నాయకులు గంగారాం, కొండ్లెపు ముత్యం సూచించారు. మోచి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మోచిలకు అందజేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మోచీ సంఘం నాయకులు బాలశంకర్ కృష్ణ, కావల్ల సురేశ్, దశరథం, పరమేశ్వర్, కొండ్లెపు శ్రీనివాస్, కావాలా గోపి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి సన్నిధిలో శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 6 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	0	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	0	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	0	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	0	560
నందీశ్వర సూట్స్	0	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	01	448
పార్వతీపురం స్పెషల్	0	672
పార్వతీపురం సాధారణ	0	336

- వేములవాడ

సిబ్బంది నిర్లక్ష్యం.. వినియోగదారులకు నష్టం

సిరిసిల్లటౌన్: విద్యుత్ బిల్లుల రీడింగ్ నమోదులో సెస్ సిబ్బంది ఆలస్యం చేయడంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సిరిసిల్లలో నిరసన తెలిపి మాట్లాడారు. నెలకోసారి ముప్పై రోజుల్లోపు నమోదు చేయాల్సిన మీటర్ రీడింగ్స్ 32 రోజులు ఆపైబడి తీస్తున్నారన్నారు. ఇలా తీయడంతో రీడింగ్ 200 యూనిట్లు దాటుతుండడంతో గృహజ్యోతి పథకానికి అనర్హులు అవుతున్నారన్నారు. కుసుమ గణేశ్, చిప్ప దేవదాసు, అనిల్‌కుమార్, వేముల పోశెట్టి, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



లేబర్ వెల్ఫేర్ బోర్డును ప్రైవేటీకరించొద్దు

బోయినపల్లి: కార్మికులు పోరాడి సాధించుకున్న లేబర్ వెల్ఫేర్ సంక్షేమబోర్డు, లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చే ఆలోచనను విరమించుకోవాలని జిల్లా భవన నిర్మాణ సంఘం సహాయ కార్యదర్శి గురజాల శ్రీధర్ కోరారు. బోయినపల్లిలో ఆదివారం కార్మికులతో కలిసి మాట్లాడారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పరిధిలో ఉన్న లేబర్ సంక్షేమబోర్డుతో లక్షలాది కార్మికులు అనేక ప్రయోజనాలు పొందారన్నారు. ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 27న చలో కలెక్టరేట్ చేపడుతున్నట్లు తెలిపారు. లింగయ్య, రాజు, రాజు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ వద్ద ఆదివారం రాత్రి బైక్ అదుపుతప్పి ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సదరు వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గం

సిరిసిల్లటౌన్: జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నమనేని శ్రీకుమార్, ప్రధాన కార్యదర్శిగా ఏ.రాందాస్, ఉపాధ్యక్షులుగా డి.లక్ష్మీనారాయణ, వై. ప్రసాద్‌రావు, సంఘస్వామి, జాయింట్ కార్యదర్శులు పి.రాంచంద్రం, సానబాబు, సీహెచ్. రాజశేఖర్, మాదాసు లక్ష్మణ్, అజిత్‌రావు, బాపురెడ్డి, బోయిన రవి, మాధవరెడ్డి, కార్తీక్, కార్యవర్గ సభ్యులు అనిల్‌గౌడ్, పి. ప్రభాకర్, జి. శ్రీనివాస్, బాలేశ్, దేవయ్య, వేణు, లతీఫ్, స్వామి, అజీమ్, రామస్వామి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

టేకు చెట్లు నరికివేత

వీర్నపల్లి: మండలంలోని కంచర్ల గ్రామ పరిధిలోని లచ్చక్క చెలక ప్రాంతంలో కొందరు యథేచ్ఛగా టేకు చెట్లను నరికివేస్తున్నారు. అటవీ భూముల్లోని చెట్లను నరికివేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నియామకం

వేములవాడఅర్బన్: జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సంఘస్వామి యాదవ్‌ను ఆదివారం వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.